**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 09.11.2024** **సమయం: 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ నెల 14 వ తేదీ నుంచి 26 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.
2. మహారాష్ట్ర బిజెపి నాయకులు తెలంగాణలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం గురించి తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని, తమ ప్రభుత్వం అనేక సంక్షేమ చర్యలు తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు
3. వచ్చే నెలలోగా పెండింగ్ రుణమాఫీ చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు.
4. తెలంగాణలో రైతులు తమ ధాన్యం తీసుకువచ్చినా ప్రభుత్వం కొనుగోళ్ళు జరపడం లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు.

------------------------------

**CELEBRATIONS:** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తి అవుతున్నందున ఈ నెల 14 వ తేదీ నుండి డిసెంబర్ 9 వ తేదీ వరకు 26 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈరోజు సచివాలయంలో జరిగింది. భట్టి విక్రమార్క మాట్లాడుతూ,

రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో దేశంలోని మరే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేని ఎన్నో విప్లవాత్మక, ఊహకు అందని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. ఈ 26 రోజుల కార్యక్రమాల్లో ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై చైతన్య పరుస్తామని తెలిపారు. ఇప్పటికే 50 వేల ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందని, దాదాపు రూ. 18 వేల కోట్ల రూపాయల వ్యవసాయ రుణాల మాఫీ చేయడంతోపాటు మహిళా సంఘాలకు 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందచేశామని గుర్తు చేశారు. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మ దినం రోజున ప్రారంభమయ్యే ఈ ప్రజా విజయోత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు.

----------------------

C M: తెలంగాణలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం గురించి మహారాష్ట్రలో బిజెపి నాయకులు గత కొద్దిరోజులుగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు ఈరోజు ముంబైలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో చేసిన వాగ్దానాల అమలు గురించి అసత్య ప్రచారంలో ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా తన స్వరం కలిపారని విమర్శించారు మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి మహారాష్ట్రలో అత్యంత పెద్ద సంఖ్యలో రైతుల ఆత్మహత్యలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం మహారాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని ఆరోపించారు కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన విధంగా రైతులకు రుణమాఫీ అందజేస్తుందని ప్రభుత్వం 25 రోజుల్లో 22 లక్షల మందికి పైగా రైతులకు 17,869 కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేసిందని ఆయన చెప్పారు.

---------------------------

KULA GANANA-BHATTI: కుటుంబ సమగ్ర సర్వేపై ప్రజల్లో తలెత్తే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సర్వేకు సంబంధించి జిల్లాల కలెక్టర్లు గణకులతో విస్తృతంగా మాట్లాడాలని, మంత్రులు, శాసన

సభ్యులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై ఉప ముఖ్యమంత్రి ఈ ఉదయం ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రశ్నావళీని పకడ్బందీగా రూపొందించారని చెప్తూ, సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. యావత్ దేశం తెలంగాణ రాష్ట్రం చేపట్టిన కుటుంబ సర్వేను గమనిస్తోందని, ప్రగతిశీల భావాలను, కార్యక్రమాలను కొంసాగించటానికి ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్రంలో రెండోదశ సమగ్ర కుటుంబ సర్వే ఈరోజు ప్రారంభమైంది. ఇంటి సభ్యుల వివరాలు, వారి సామాజిక-ఆర్థిక స్థితి, ఉపాధి, విద్య, కుల సంబంధిత వివరాలను ఎన్యూమరేటర్లు సేకరిస్తున్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నివాసమైన రాజ్ భవన్ లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణలో భాగంగా ప్రిన్సిపాల్ సెక్రెటరీలు సందీప్ కుమార్ సుల్తానియా, బుర్రా వెంకటేశం, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కమిషనర్ GHMC స్నేహ శబరిష్ మొదలైన వారు సర్వే బృందం వెంట ఉన్నారు. సంగారెడ్డి పట్టణం లోని విద్యానగర్ కాలనీ, వార్డు నెం 32 లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే ప్రక్రియ లో భాగంగా వైద్య ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ కుటుంబ వివరాలను ఎన్యుమరేటర్ నమోదు చేశారు.

-------------------------------

NIRANJAN: నిర్మల్ జిల్లా దిలావర్పూర్ మండలంలో ఈథనల్ కర్మాగారం ఏర్పాటు చేసే ప్రతిపాదన పట్ల నిరసనగా సమగ్ర కుటుంబ సర్వేను బహిష్కరించిన రెండు గ్రామాల ప్రజలతో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ చర్చలు జరుపుతున్నారు. దిలావర్ పూర్ మండలంలోని గుండంపల్లి దిలావర్పూర్ గ్రామానికి చెందిన గ్రామస్తులు సర్వేను బహిష్కరించారు వారి సమస్యలు అభ్యంతరాలు గురించి వివరాలు తెలుసుకునేందుకు నిరంజన్ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో మాట్లాడారు గ్రామస్తులతో మాట్లాడాలని సర్వే ప్రాముఖ్యత గురించి వారికి

తెలియజేసి ఎటువంటి అపోహలు ఉన్నా తొలగించి సర్వే సక్రమంగా జరిగేలా చూడాలని నిరంజన్ సూచించారు. సర్వేలో పాల్గొనాలని గ్రామస్తులను ఒప్పించేందుకు కలెక్టర్ వారికి సర్వే గురించి వివరించారు.

-----------------------------

KHAMMAM: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల వరకు రుణాలు ఉన్న రైతులకు 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని, మరో 13 వేల కోట్లు మాఫి చేయాల్సి ఉందని, వచ్చే నెలలోగ పెండింగ్ రుణమాఫీ చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఈరోజు మంత్రి కూసుమంచి మండల తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ప్రజా ప్రభుత్వం వచ్చిన పది నెలల వ్యవధిలో 57 వేల పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టుల భర్తీకి పరీక్షలను నిర్వహించామని, డిసెంబర్ నెలలో వారికి ఉద్యోగాల అపాయింట్మెంట్ ఆర్డర్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు.

---------------------------------

KISHAN REDDY: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 11 నెలలు అయ్యి, వరంగల్ లో రైతు డిక్లరేషన్ చేసి, రైతులకు అనేక హామీలు ఇచ్చినా అమలుకు నోచుకోలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. 68 లక్షల మంది పంట రుణాలు తీసుకుంటే, 15 లక్షల మంది రైతులకు మాత్రమే రుణ మాఫీ అయిందని అని ఆయన అన్నారు. రైతులు తమ ధాన్యం తీసుకువచ్చినా ప్రభుత్వం కొనుగోళ్ళు జరపడం లేదని కిషన్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు కష్టాలు తెలుసుకోలేదని కిషన్ రెడ్డి ఆరోపించారు.

---------------------------------------

kurumurthy: మహబూబ్నగర్ జిల్లా అమ్మాపూర్ గ్రామంలో కాంచన గుహలో స్వయంభుగా కొలువైన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన. కురుమూర్తి ఉద్దాల వేడుక అంగరంగ వైభవంగా సాగింది. పల్లమర్రిలో చాటకు ముందుగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పూజలు చేయగా, అక్కడి నుంచి ఉద్దాల ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. గ్రామాల్లో భక్తులు ఉద్దాలకు పూజలు చేశారు.

---------------------------

SPECIAL SUMMARY: రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు వికారాబాద్ జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలో శివా రెడ్డి పేట్ గ్రామం నందు 133, 134 పోలింగ్ స్టేషన్ లను ఆయన ఈ రోజు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ గా నమోదుకు రేపు కూడా బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంప్ లు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

-----------------------------

KAUSHIK: హుజురాబాద్ నియోజకవర్గంలో రెండవ విడత దళితబంధు ఇచ్చేవరకు తన పోరాటం ఆగదని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లో దళిత బంధు రెండవ విడత విడుదల చేయాలని చేసిన ధర్న చేసారు. పోలీస్ లు ఎమ్మెల్యే ను పోలీస్ స్టేషన్ కు తరలించే ప్రయత్నంలో తీవ్ర తోపులాట జరిగింది. దీంతో ఓ మహిళకు గాయాలు అయ్యాయి. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నీ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం దళిత కుటుంబాలతో అంబేద్కర్ చౌరస్తా వద్ద దాదాపు గంట సేపు ధర్నా కొనసాగడం తో కరీంనగర్- వరంగల్ రహదారి పై భారీగా వాహనాలు నిలిచాయి.

---------------------------

HAJ PILGRIMATE: హజ్ యాత్ర ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చింది ఈ యాత్రలో సౌకర్యం అందుబాటు

పెంచేందుకు డిజిటల్ మౌలిక సదుపాయాలు కూడా మరింత మెరుగు పరుస్తున్నారు. మహిళల సమానత్వాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన ఈ చర్యలు మరింత మంది మహిళలు స్వతంత్రంగా యాత్ర చేపట్టేలా ప్రోత్సహిస్తాయి. తక్కువ ఆదాయం కల వ్యక్తులకు కూడా యాత్ర చేపట్టే విధంగా తోడ్పడేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది జనవరిలో సంతకాలు చేసిన ద్వైపాక్షిక హజ్ ఒప్పందం ప్రకారం 2024 యాత్రలో భారత్ నుంచి 1,75,000 మందికి పైగా యాత్రికులు పాల్గొనేలా హజ్ కోటాను నిర్ధారించారు భారత హజ్ కమిటీ ద్వారా వెళ్లేందుకు లక్షల 40000 సీట్లను రిజర్వు చేశారు ప్రభుత్వం భారత దౌత్య కార్యాలయాలలో కేంద్రాలు ఏర్పాటు చేసి విదేశాల్లో యాత్రికుల సంక్షేమం భద్రత కోసం మద్దతు చర్యలు అందిస్తుంది.

-----------------------------------